# మనస్తత్వము

శ్రీ వి. గోపాలకృష్ణమూర్తి

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

వేదకథాభారతి - 19

# శునశ్శేఫుడు

రచన

శ్రీ వి. గోపాలకృష్ణమూర్తి

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య

ప్రచురణ

డాక్టర్ ఐ.వి. సుబ్బారావు, ఐ. ఏ. ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 19

**SUNASSEPHUDU**

by

***Sri V. Gopala Krishna Murthy***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

*Laser typeset at*
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens, Tirupati ✆ : 30184

*Printed at*
**MUDRICA OFFSET PRINTERS**
Sanyasiraju St., Gandhi Nagar
Vijayawada ✆ : 579654

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వాహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేధాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన! ఎంతటి ధార్మిక చేతన!'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -

**ఈ వేద కథా భారతి.**

వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?


ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన **అన్నపూర్ణ గ్రాఫిక్స్** వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ

వేద కథా భారతీ

❀ ❀ ❀



# మనవి

వేద కథాభారతి.

అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించచడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య

భవిష్యత్తును దర్శిస్తున్నాడు. ఆబాలకుడు నిస్సహాయుడై హతాశుడై ఉన్నాడు.

ప్రజలు అతని పుష్ట శరీర మాంసాన్ని పవిత్రాహుతిగా వేయడం చూడాలని అనుకుంటున్నారు. వాళ్ళ స్వార్థం అతని వినాశంలో ఉంది. అతని స్వార్థం తనను తాను రక్షించుకోవడంలో ఉంది. పరస్పర విరుద్ధమైన స్వార్థసంఘర్షణలో, జీవన్మృత్యుద్వంద్వంలో, ఉనికి – త్యాగముల మధ్య నిస్సహాయస్థితిలో ఉన్న ఆ వ్యక్తి ఎవరు? అతణ్ణి ఎందుకలా బంధించారు? అతని తల్లి దండ్రులెవరు? తెలుసుకోవాలని ఉందా? అయితే చదవండి-

తల్లి దండ్రులిరువురూ బ్రతికి ఉండి కూడా అనాథ అయిన ఆదీనుని దయనీయగాథను అవలోకించండి. కరుణరసాప్లావితమైన ఆ భాగ్యహీనుని చరిత్రను తిలకించండి. ఏపాపమూ ఎరుగని అమాయకుడైన ఆమునిబాలకుడే శునశ్శేపుడు.

శునశ్శేపుడు ఒక ప్రసిద్ధ మహర్షి. ఇతడు భృగువంశంలోని అజీగర్తుడనే ఋషి పుత్రులలో మధ్యముడు. ఇతని ఇద్దరు అన్నదమ్ములు శునపుచ్ఛుడు, శునలాంగూలుడు. ఇతని గోత్రనామం లేదా పైతృకనామం 'ఆజీగర్తి'. అనగా అజీగర్తుని కుమారుడని అర్థం. ఇతనికి 'సాయవసి' 'సోమబలి' అని కూడ పేర్లున్నాయి. ఇతను విశ్వామిత్రునికి మేనల్లుడు మరియు ప్రియశిష్యుడు కూడ. విశ్వామిత్రుని శిష్యుడైన తరువాతనే ఇతనికి దేవరాతుడనే పేరు ప్రసిద్ధమైంది. ఇతనిని భృగువంశంలో శునశ్శేపుడని, గాధివంశంలో దేవరాతుడని అంటారు. దేవతలు ఇతనిని బలినుండి విడిపించుటచే ఇతనికి దేవరాతుడని పేరొచ్చింది.

**మంత్రద్రష్ట :**

శునశ్శేపుని కథ వేదసంహితలు, బ్రాహ్మణాలు, రామాయణ భారతేతిహాసాలు, పురాణాలు, శ్రౌతసూత్రాలు మొదలైన గ్రంథాల్లో విభిన్న సంఘటనలతో అనేక ప్రకారాలుగా వర్ణించబడింది. ఋగ్వేదంలో శునశ్శేపుని కథ అత్యంత సంక్షిప్తంగాను, అస్పష్టంగాను ఉంది. శునశ్శేపుడు ఋగ్వేదంలో నూరు ఋక్కులను, ముప్పై ఒక్క గాథలను దర్శించినట్లు ఐతరేయ బ్రాహ్మణం చెబుతున్నది ('తదేతత్పరఋక్శతం గాథం శౌనశ్శేఫమాఖ్యానమ్'. ఐ.బ్రా. 7-18). ఇతడు ఋగ్వేదం ప్రథమమండలంలో ఏడు సూక్తాలను, మొదటి అష్టకంలోని మంత్రాలను దర్శించిన మంత్రద్రష్ట. ఇతడు ఇంద్రుడు, వరుణుడు మొదలైన దేవతల నుద్దేశించి చేసిన ప్రార్థనలు ఋగ్వేదంలో ఋక్కులుగా వెలసిన్నై. ఇతడు దేవతల సహాయం వలన మృత్యుముఖంనుండి బయటపడినట్లు ఋగ్వేదంలో చెప్పబడింది. ఋగ్వేదం ప్రథమమండలం ఆరవ అనువాకం, 30 వసూక్తంలో ఇంద్రుడు శునశ్శేపునికి స్వర్ణరథాన్ని బహూకరించినట్లు చెప్పబడింది (ఋగ్వేదం 1. 24- 30; 12-13; 5.2.7; 9-3;)

శునశ్శేపుడు సామవేదంలో పదిహేడు దశతుల్లో కొన్ని మంత్రాలను దర్శించాడు. కృష్ణయజుస్సంహితలో ఇరవైనాలుగు మంత్రాలను దర్శించాడు. యజుర్వేదంలో ఇతనిని గురించి 'వరుణగృహీతః' అని చెప్పబడింది. ఇతణ్ణే వరుణుడే జలోదరవ్యాధిగ్రస్తుని చేసినట్లు, కాని ఇతడే స్వయంగా మంత్ర ప్రార్థనలద్వారా వరుణ పాశములనుండి, వ్యాధినుండి విముక్తుడైనట్లు

సంక్షిప్తంగా చెప్పబడింది. యజుర్వేదం తైత్తిరీయసంహిత, 5.2.1.3; కాఠకసంహిత 19-11; కాపిష్ఠల కఠసంహిత 2.1.1 లలో ఇతని ప్రస్తావన ఉంది.

శునశ్శేపుడు అథర్వవేదం ఆరవకాండలోని ఇరవై ఐదవ సూక్తం, ఏడవ కాండలోని ఎనభైమూడవ సూక్తాలలోని మంత్రాలను దర్శించాడు. ఇతడు ప్రజాపతి, అగ్ని, సవిత, వరుణుడు, విశ్వేదేవతలు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు మరియు ఉషస్సును గురించి చేసిన ప్రార్థనలు మనకు వేదాలలో మంత్రాలుగ లభిస్తున్నై.

ఐతరేయ బ్రాహ్మణం (7-13-18) మరియు శాంఖాయన శ్రౌత సూత్రం (15-20-21;16-11-2) లలో చెప్పబడిన కథనుబట్టి ఇతణ్ణి హరిశ్చంద్రుని కుమారుడైన రోహితుడు తన తండ్రి, వరుణునికి యజ్ఞపశువుగా సమర్పించడానికై కొంటాడు. ఆ తరువాత ఇతణ్ణి యూపస్తంభానికి కట్టివేస్తారు. విశ్వామిత్రుని సలహామేరకు ఇతడు బంధవిముక్తికై వరుణుడు, ఇంద్రుడు మొదలైన దేవతలను ప్రార్థిస్తాడు. వరుణుడితణ్ణి బంధవిముక్తుణ్ణి చేస్తాడు. ఆతరువాత విశ్వామిత్రుడితనిని పుత్రునిగా స్వీకరిస్తాడు. దానిని విశ్వామిత్రుని కుమారులు వ్యతిరేకిస్తారు. అందుకు విశ్వామిత్రుడు తన కుమారులను శపిస్తాడు. ఈ శునశ్శేపుడే తరువాత దేవరాతుడుగ ప్రసిద్ధి చెందుతాడు. ఋగ్వేదం (5-2-7) లోను, బ్రాహ్మణగ్రంథాలలోను ప్రస్తావించబడిన ఈ కథ 'వేదార్థదీపికా' లో విపులంగా వివరించబడింది.

**పురాణేతిహాసాల్లో శునశ్శేపుడు :**

వైదిక వాఙ్మయంలో వర్ణించబడిన ఈ కథ పురాణసాహిత్యంలో సవివరంగా అనేక పర్యాయములు పునరావృతమైంది. వాల్మీకి రామాయణం- బాలకాండ 61,62; మహాభారతం - అనుశాసనిక పర్వం. 3; శాంతిపర్వం - 294; శ్రీమద్భాగవతం. 9-7; హరివంశం. 1-27; దేవీభాగవతం. 7. 14-17; విష్ణుపురాణం 4-7; బ్రహ్మపురాణం. 10లలో శునశ్శేపుని ప్రస్తావన ఉంది.

ఒక బ్రాహ్మణ యువకుడు యజ్ఞపశువుగ సమర్పించబడి, విశ్వామిత్రునిచే రక్షించబడినట్లు పురాణాల్లో ప్రసిద్ధమైన కథ ఉంది. ఆ బ్రాహ్మణయువకుడే శునశ్శేపుడు.

కాని పురాణాల్లో కూడా రెండు విధాలైన కథలున్నాయి. ఒక కథ ప్రకారం ఇతడు ఋచీకముని కుమారుడు. ఇతణ్ణి అంబరీషుడు యాగపశువుగా స్వీకరించాడు. మరొక కథ ప్రకారం శునశ్శేపుడు అజీగర్తుడనే బ్రాహ్మణుని కుమారుడు. ఇతణ్ణి హరిశ్చంద్రుడు యజ్ఞపశువుగా స్వీకరించాడు.

శునశ్శేపుని కథ కొద్ది మార్పులతో దేవీ భాగవతం మరియు ఇతర పురాణాల్లో ఉంది. బ్రహ్మాండ పురాణంలోని 58వ అధ్యాయంలో శునశ్శేపుని కథ వాల్మీకిరామాయణంలో వలెనే వర్ణించబడింది.

వైదిక సాహిత్యంలో శునశ్శేపుని కథ నాటకీయ పద్ధతిలో వర్ణించబడింది. దీర్ఘ రాత్రి తరువాత జరిగే ఉషోదయానికి సంకేతంగా ఈ కథ చెప్పబడింది.

**అమరావతిని తలపిస్తున్నది :**

అది అయోధ్యానగరం. భూదేవికి ముఖదర్పణము వంటిదై, శత్రువులకు దుర్భేద్యమైన ఆ నగరం అతి సుందరం. చిగురుమామిడి చెట్లతో, చెంగలువ బావులతో, సుగంధ మందమారుతములతో అది అమరావతిని తలపిస్తున్నది. పగడపుతీగలు, కందకాల్లోని నీటితామరులు ఆ నగరానికి వెలలేని ఆభరణాలు. బాగుగా పెరిగిన చెఱకుతోటలు, ఆకాశాన్నంటే కోటలు, వజ్రమయకవాటాలు, ముత్యాల కొలువుకూటాలు, రాజుల మేడలు, పౌరుల వాడలు, తీర్చిదిద్దినట్లున్న వీధులు, నీడలు కనబడే మాణిక్యవేదులు, చిత్రీకరించబడిన పతాకావితానాలు, బృందగానాలు, బహువిధాలైన దేవతాప్రాసాదాలు, రకరకాల తూర్యనాదాలు, పరతత్త్వవిదులైన బ్రాహ్మణోత్తములు, దేవేంద్రునితో సమానులైన రాజశ్రేష్ఠులు, కుబేరునికి సాటియైన వర్తకులు, రసజ్ఞులైన నర్తకులతో ఆ సాకేతపురి శోభాయమానంగా విలసిల్లుతున్నది.

అక్కడి చెట్లు మందారవృక్షాలను తలపిస్తై. రథాలు అదృష్టవంతుల మనోరథాలవలె అడ్డులేకుండా నడుస్తై. మత్తేభాలు మదజలధారలతో భువికి దిగివచ్చిన మహామేఘాల్లా సంచరిస్తై. అక్కడ ప్రతివీధి రత్నతోరణాలతో అలంకరించబడి ప్రకాశిస్తుంది. అక్కడి యోధులకు యుద్ధమంటే పండుగ. అక్కడి అశ్వాలు సూర్యుని రథాశ్వాలను ధిక్కరించేవిగా ఉన్నై. దండనాథులు అనేక యుద్ధాల్లో తగిలిన గాయాలే వెలలేని ఆభరణాలుగా శోభిస్తున్నారు. అక్కడి మావటివాళ్ళు ఎంతటి మదపుటేనుగునైనా చెయ్యెత్తి తొండాన్ని గట్టిగా పట్టుకొని లోబరచుకుంటారు. రౌతులు శత్రువులను ఒక్క వ్రేటుతో

ఆరుముక్కలుగా ఖండిస్తారు. వీరభటులకు ఖడ్గ యుద్ధంలో ఎదురు లేదు. మల్లులు ఏనుగులతోనైనా కలియబడి ఓడించగలవారు.

**నాకుమారుని నీకు సమర్పిస్తాను :**

ఇటువంటి మహాపట్టణాన్ని రాజధానిగా చేసుకొని సూర్యవంశంలో పుట్టిన హరిశ్చంద్ర సార్వభౌముడు పరిపాలిస్తున్నాడు. ఆయన సత్యం తప్పనివాడుగా ప్రసిద్ధికెక్కాడు. దేవతల కోరిక మేరకు రాజాలందరినీ జయించి రాజసూయయాగం చేశాడు. దీవులన్నింటిలో విజయస్తంభాలను నాటి ఆ చక్రవర్తి లోకాల్లో శాశ్వతకీర్తిని సంపాదించాడు. అతని ప్రధానమంత్రి సత్యకీర్తి. దేవేంద్రునికి బృహస్పతివలె, ఆమహామంత్రి తనకు సహాయుడు కాగా హరిశ్చంద్రుడు అమరేంద్రునివలె మహావైభవశాలియై, ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడుతూ రాజ్యమేలుతున్నాడు.

ఆ ప్రభువు పట్టపురాణి చంద్రమతి. ఆమె మొదటి భార్య. ఆమె గాక ఇంకా తొంభైతొమ్మిదిమంది భార్యలున్నారు. కానీ వారికి బిడ్డలు కలుగలేదు. చివరకు నారదమహర్షి సలహామేరకు హరిశ్చంద్రుడు గంగాతీరానికి వెళ్ళి వరుణుని గురించి తపస్సు చేశాడు. వరుణుడు ప్రత్యక్షమై అతనికి పుత్రసంతానం కలుగునట్లు వరం అనుగ్రహించాడు. హరిశ్చంద్రుడు తన కుమారుని వరుణునికి యాగపశువుగా సమర్పిస్తానని వాగ్దానం చేశాడు.

**అల్లారు ముద్దుగా . . . . .**

తరువాత కొన్నాళ్ళకు చంద్రమతి గర్భం దాల్చింది. నవమాసాలు

నిండినై. ఒక శుభదినాన పండంటి పుత్రుని ప్రసవించింది. అతనికి రోహితాశ్వుడని నామకరణం చేశారు. అతడు శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్ధమానుడౌతున్నాడు. లేకలేక కలిగిన ఆబిడ్డను చూసి తల్లిదండ్రులు పొందుతున్న ఆనందానికి అవధులు లేవు. రాజాంతఃపురంలో దాసదాసీజనుల సపర్యలతో ఆ బిడ్డ అల్లారుముద్దుగా పెరుగుతున్నాడు.

రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్నై. కాని హరిశ్చంద్రుడు పుత్రుని వరుణునికివ్వలేదు. అనేక పర్యాయాలు వరుణుడు ఆబిడ్డను ఇమ్మని అడిగాడు. కానీ హరిశ్చంద్రుడు ఏవో సాకులు, క్షమాపణలు చెబుతూ వాయిదావేస్తూ వచ్చాడు. ఎట్టకేలకు హరిశ్చంద్రుడు తన కుమారునికి పదకొండవ ఏట ఉపనయనము చేసిన తరువాత వరుణునికివ్వడానికి సమ్మతించాడు.

**జలోదరవ్యాధి పీడిస్తుంది :**

పిల్లవానికి పది సంవత్సరాలు పూర్తయినై. పదకొండవ సంవత్సరం వచ్చింది. చక్రవర్తి అతనికి ఉపనయనం చేయ సంకల్పించాడు. రాజమందిరంలో అందుకు కావలసిన ఏర్పాట్లు జరుగుతున్నై. ఇంతలో వరుణుడు ప్రత్యక్షమైనాడు. రాజకుమారుడు తన తండ్రి తనను ఉపనయనం తరువాత యజ్ఞపశువుగా బలి ఇస్తాడని గ్రహించి, రాత్రికిరాత్రే రాజమందిరాన్నుండి అడవికి పారిపోయాడు. వరుణుడు హరిశ్చంద్రుని బిడ్డనిమ్మని అడిగాడు. మహారాజా కలవరపడ్డాడు. వరుణుడు కోపంతో మహారాజును జలోదర వ్యాధిపీడితుడవుకమ్మని శపించాడు. రాజా రోగగ్రస్తుడయ్యాడు. రోహితాశ్వుడు

బాటసారులద్వారా తన తండ్రి వ్యాధిగ్రస్తుడయ్యాడని విన్నాడు. తన కారణంగా తండ్రికి ఈ ఆపద వచ్చిందని చాలా విచారించాడు. రాజమందిరానికి తిరిగి రావాలని అనేక పర్యాయములనుకున్నాడు. కాని ప్రతిసారి ఇంద్రుడు బ్రాహ్మణవేషంలో ప్రత్యక్షమై, అతని మనసు మార్చి, ఆ ప్రయత్నం నుండి విరమింపచేశాడు.

**వరుణుని సంతోషపెట్టు :**

హరిశ్చంద్రుడు తన దుఃఖానికి, విపత్తుకు పరిష్కారమార్గం చూపమని కులగురువైన వసిష్ఠమహర్షిని ప్రార్థించాడు. వరుణునికిచ్చిన వాగ్దానాన్ని ఏదో ఒక విధంగా నెరవేర్చమని వసిష్ఠ మహర్షి హరిశ్చంద్రునికి సలహా ఇచ్చాడు. ఆయనింకా ఇలా అన్నాడు- ''పుత్రులు పలువిధాలు. ధనమిచ్చి కొన్నవాడు కూడ పుత్రుడే అవుతాడు. కాబట్టి ఒకపుత్రుని కొని వరుణునకివ్వు. ఎవరైనా బ్రాహ్మణుడు కొడుకుని అమ్ముతాడేమో చూడు. నీవు వరుణుని సంతోషపెడితే నీ వ్యాధి నయమవుతుంది.''

**మీ కుమారుని అమ్ముతారా?**

ఇది విని రాజు సంతోషించాడు. ఎవరైనా బ్రాహ్మణుడు తన కుమారుని అమ్ముటకు సిద్ధంగా ఉన్నాడేమో వెతకమని తన తండ్రిని ఆదేశించాడు. మంత్రి వెతకగా, వెతకగా అతనికి పరమకఠినాత్ముడు, లోభి, దురాశగల బ్రాహ్మణుడొకడు దొరికాడు. అతడే శునశ్శేపుని తండ్రి- అజీగర్తుడు. అతనికి ముగ్గురు కుమారులు. వాళ్ళు శునపుచ్ఛుడు, శునశ్శేపుడు, శునలాంగూలుడు. వారిలో జ్యేష్ఠుడు కర్మాధికారి కావున అతనిని అమ్మనన్నాడు తండ్రి. కనిష్ఠుడంటే తనకు ఎక్కువ ప్రీతి

కాబట్టి అతనినివ్వనంది తల్లి. తల్లిదండ్రుల అభిప్రాయాలను విన్న రెండవ కుమారుడైన శునశ్శేపుడు, తనను వారు విక్రయించుటకు సిద్ధపడినట్లు గ్రహించి మంత్రి వెంట బయలుదేరాడు. అందుకు ప్రతిగా మంత్రి అతనికి నూరుగోవులు ఇవ్వడానికి అంగీకరించాడు. ఈ విధంగా మంత్రి శునశ్శేపుని కొని రాజమందిరానికి తీసుకొనివచ్చాడు.

ఆ తరువాత అతనిని యాగశాలకు తీసుకొని వెళ్ళారు. అక్కడ విశ్వామిత్రుడు హోతగ, జమదగ్ని అధ్వర్యుడుగా, వసిష్ఠుడు బ్రహ్మగా, ఆయాస్యుడు ఉద్గాతగా యాగం మొదలైంది. శునశ్శేపుని రక్తమాల్యాను లేపనాలతో అలంకరించారు. కాని అతనిని యూపస్తంభానికి బంధించడానికి, బలి ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. అప్పుడతని తండ్రి అజీగర్తుడే నూరు ఆవులను తీసుకొని శునశ్శేపుని దర్భపాశాలతో మూడు యూపాలకు బంధించాడు. మరోనూరు ఆవులకు ఆశపడి చివరకాతండ్రి అతనిని బలి ఇవ్వడానికి కూడా సిద్ధపడ్డాడు.

**క్షణంలో భస్మమై పోతుంది :**

అప్పుడు శునశ్శేపుని పరిస్థితి అతిదయనీయంగా, శోచనీయంగా ఉంది. సమీపించిన మృత్యువు అతని కళ్ళల్లో కనబడుతున్నది. అతని దృష్టిలో జగత్తు ఏ సమయంలోనైనా కనుమరుగు కావచ్చు. ఈ సుందరమైన, సుఖవంతమైన ప్రపంచాన్ని అతనికమూడలేడు. ముహూర్త మాత్రంలో అక్కడ హాహాకారాలతో నీళ్ళు ఎగిసిపడతై. యువకుడైన అతని సుందర, సుదృఢ శరీరం క్షణంలో భస్మమై పోతుంది. అతని మదిలో ఈ భయంకరభావనలు మెదలగానే అతడు మృత్యుభీతితో భయకంపితుడయ్యాడు. విషాదంతో వివశుడయ్యాడు. ప్రజల

క్రూరత్వంపై అతనికి కోపం వచ్చింది. కానీ ఏం చేస్తాడు? అతడు పాశబద్ధుడై ఉన్నాడుగదా !

**బలికి భయపడుతున్నాడేమి?**

అతని ఆలోచనలు కార్యరూపం దాల్చలేదు. అతని దయనీయ వాణి యాగమండపంలో ప్రతిధ్వనించింది. కానీ ప్రజల కుతూహలం అతణ్ణి వివశుణ్ణి చేసింది. అతని శరీరం ప్రజల క్రూరవినోదసాధనమైంది. ప్రజల కఠినత్వాన్ని, నిర్దయను చూసి అతని కళ్ళు అనాయాసంగా మూతపడినై.

పాశబంధంచే పీడితుడైన శునశ్శేపుని కళ్ళనుండి అవిరళంగా అశ్రుధార ప్రవహిస్తోంది. దయనీయమైన అతని అవస్థను చూస్తున్న ప్రజలకు అతనిపై జాలి కలుగకపోగా ఆశ్చర్యం కలిగింది.

> *''ఇతను మనుష్యుడై ఉండి కూడా బలికి భయపడుతున్నాడేమి ! దేవతలను ప్రసన్నం చేసే స్థానంలో ఉండి రోదిస్తున్నాడేమి ! మృత్యువుకు భయపడుతున్న ఇతడు స్వర్గమార్గం నుండి విచలితుడౌతాడు''* -

అని అక్కడి వాళ్ళంతా అతని ప్రవర్తనకు అసంతుష్టులయ్యారు. కొంతమంది కళ్ళలో అతనిపట్ల ఉపేక్ష కనబడింది. మరి కొంతమంది అతని పిరికితనానికి ఉదాసీనులయ్యారు.

**నీ యజ్ఞానికి భంగం కలిగిస్తా!**

ఇంతలో బ్రహ్మర్షి విశ్వామిత్రుడు అక్కడకు విచ్చేశాడు. అతడు దీనంగా జాలిగొలిపేటట్లు దుఃఖిస్తున్న శునశ్శేపుని ఓదార్చాడు. మహారాజుతో "రాజా! ఈ బాలుని విడిచిపెట్టు. ఇతనిని వదలనిచో నీ యజ్ఞానికి భంగం కలిగిస్తా" అన్నాడు. అప్పుడు హరిశ్చంద్రుడు విశ్వామిత్రునితో "మహర్షీ! నేను రోగవిముక్తుడను కావడానికి ఈ యజ్ఞం చేస్తున్నాను. మీకు కావలసినంత సంపదనిస్తాను. దయచేసి ఈ యజ్ఞానికి విఘ్నం కలిగించకండి" అన్నాడు.

**నీకు భయంలేదు :**

ఈ మాటలు ఒకవైపు, బాలుని దుఃఖం మరొకవైపు విశ్వామిత్రుని కోపోద్రిక్తుని చేసినై. అతడు శునశ్శేపునికి వరుణమంత్రాన్నుపదేశించి "బాలకా! నీవీ మంత్రాన్ని జపించు. నీవు మృత్యువునుండి తప్పక రక్షించబడతావు" అని శునశ్శేపునకు అభయమిచ్చాడు.

జీవన్మరణాల మధ్య ఊగిసలాడుతున్న శునశ్శేపునకు వరుణదేవుడు ఒక ఆశాకిరణంగా కనుపించాడు. అప్పుడతను గద్గదస్వరంతో వరుణదేవుని ఈ విధంగా ప్రార్థించాడు –

**వరుణ ప్రార్థన :**

*"ఓ వరుణ దేవా! పాశబద్ధుడనైన నేను రాత్రింబవళ్ళు మిమ్మల్ని స్తుతిస్తున్నాను. నన్ను పాశవిముక్తుణ్ణి చేయండి. నన్ను కట్టిన పాశములను తొలగించండి. నన్ను అగ్నికి ఆహుతి చేయకండి."*

"రాజా! వరుణా! నీకు ఉదకమధ్యంలో అనన్య సాధారణమైన, హిరణ్మయమైన నివాసభూమి కలదు. అందువలన ధృతవ్రతుడైన రాజా వరుణుడు మా సర్వస్థానములను పరిత్యజించుగాక! నీవు సర్వరోగస్థానములనుంచి మమ్ములను విమోచనం పొందించు. అంతేకాక సర్వపాపములనుంచి మమ్ములను విడిపించు. ఉదకములారా! మీరు మా సత్యాసత్య విషయములలో సాక్షిభూతులుకండి. మీపై ప్రమాణం చేస్తున్నాను. ఆపాపం నుంచి మమ్ములను విముక్తులను చేయండి. దేవా! నాశరీరంపై భాగంలో ఉన్న పాశమును ఖండించివేయి. క్రింది భాగంలో ఉన్న పాశమును అవకుంఠనంచేసి నశింపజెయ్యి. మధ్య భాగంలో ఉన్న పాశమును విడిపించు. ఆదిత్యా! నీ వ్రత కర్మలో యోగ్యతాసిద్ధికై మేము సర్వపాశములనుండి విముక్తులమై అఖండితులమగుదుముగాక! మా నుంచి సర్వపాశములను విడిపించు. నీకు సంబంధించిన ఉత్తమాధమ పాశములను, దుస్స్వప్నములవలన కలిగిన అరిష్టములను మా నుంచి నిర్గమింపజెయ్యి. ఆ తరువాత మేము పుణ్యలోకములను పొందుదుముగాక! దండంతోలాగా యజ్ఞాహుతులను తమ క్రోధంతో నివారించండి. విజ్ఞులు, బలవంతులు, కీర్తిమంతులు, సౌభాగ్యదాయకులునైన మీరు మా మధ్యనుండండి. నేను చేసుకున్న పాపాలనుండి నన్ను విముక్తుణ్ణి చేయండి."

శునశ్శేపుడు తన నిర్మలమైన అశ్రుజలంతో వరుణుడికి అర్ఘ్యమిస్తూ ఇలా స్తుతిస్తున్నాడు -

*"భగవాన్ ! మీరు నిష్ఠగల యజమాని సాధారణ హవిస్సును త్యాగం చెయ్యడం లేదు. మీరు హద్దులేని సముద్రంపైన ఎగిరి వెళ్ళిపోతారు. ఆకాశంలో పక్షులు ఎగిరే మార్గాలు తమకు తెలుసు. సముద్రగాములైన పక్షుల మార్గాలు కూడా మీరు తెలుసుకుంటారు. పన్నెండు నెలలతో పాటు మీకు అధికమాసం కూడ తెలుసు. విస్తృతము, ఉన్నతమునైన గొప్ప వాయుమార్గం కూడా మీకు తెలుసు. అఘటిత ఘటనాశక్తి సంపన్నులు మీరు. నా పిలుపు వినండి ! ఈ రోజు సంతోషకరమైన దినం. నేను మిమ్మల్ని ముక్తినిమిత్తమై ఆహ్వానిస్తున్నాను. మీరు మేధావులు. ఆకాశం, పృథివి, విశ్వాలలో ప్రకాశిస్తున్నారు. మీరు నా పిలుపును విన్నారా? నా పిలుపుకు బదులిస్తారా ?"*

**అగ్నిస్తుతి :**

యూపానికి బంధితుడైన శునశ్శేపుడు హవ్యవాహనుడైన అగ్నిదేవుని స్తుతిస్తున్నాడు -

*"హవ్యవాహనా ! మీరు సదా యువకులు. తేజస్సంపన్నులు. మీరు పుత్రుని యెడ వాత్సల్యంగల తండ్రి. బంధువులకు బంధువు. మిత్రునికి మిత్రులు.*

దేవతలను పూజించే సమయంలో మేము మీకు హవిస్సులనిస్తాము. అమర్త్యుడవైన ఓ అగ్నీ ! మీ యెడ మానవుల ప్రశంసావాక్కులు స్నేహమయంగా ఉన్నై. బలపుత్రులైన మీరు, మీ సమస్త అగ్నులతో పాటు మా ప్రార్థన వినండి.''

విశ్వేదేవతల స్తుతి :

శునశ్శేపుడు అగ్ని మరియు విశ్వేదేవతలను స్తుతిస్తున్నాడు -

''ఓ అగ్నీ! మీరు జూలుగల అశ్వంతో సమానులు. యజ్ఞ సమ్రాట్టుతో సమానులు. నేను స్తుతులద్వారా మిమ్ములను పూజిస్తున్నాను. విస్తీర్ణులు, గతిశీలురు, సుఖప్రదులునైన ఓ అగ్నిదేవా ! మా అభీష్టాలను సిద్ధింపజేయండి. నా ఈ నూతనస్తుతి దేవతల సమక్షంలో ఉత్తమంగా ఉండేటట్లు చూడండి. చిత్రభానూ ! మీరు సముద్రం చివరివరకు ప్రవహిస్తున్న జలంతో సమానంగా యజమానుని కొఱకు ప్రవహించండి. ఓ జరాబోధా! రుద్రుని కోసం మమ్మల్ని సుందరస్తుతులతో ప్రేరేపించండి.''

ఇంద్రాసోములస్తుతి :

శునశ్శేపుడు ఇంద్రాసోములను స్తుతిస్తున్నాడు -

''సోమ ప్రీతుడవైన ఓ ఇంద్రా ! ఎక్కడైతే సోమలత పుడుతుందో అక్కడ దానిని రోట్లో దంచే శబ్దం వింటూ

మీరు సోమరసాన్ని సేవించండి. ఎక్కడైతే యువతుల స్థూల జంఘలతో సమానంగా సోమాన్నిదంచే రోకళ్ళున్నాయో, అవి రోళ్ళలో సోమాన్నిదంచే సుస్వరాన్ని వింటూ పోయి సోమపానం చేయండి. ఎక్కడైతే స్త్రీలు రోళ్ళలో సోమరసాన్ని తయారుచేసే ప్రయత్నంలో ఉంటారో అక్కడ ఉలూఖ శబ్దాన్ని వింటూ వెళ్ళి సోమరసాన్ని స్వీకరించండి. సారథి ఏ విధంగా అశ్వం కళ్ళాన్ని పట్టుకొంటాడో అదేవిధంగా రోకళ్ళకు తాళ్ళు కట్టి సోమరసాన్ని చిలుకుతున్నారు. ఆ చిలికే శబ్దాన్ని వింటూ వెళ్లి సోమరసాన్ని స్వీకరించండి. ఓ ఉలూఖలా! నిన్ను ప్రత్యేక గృహంలో పెడుతున్నాము. మీరు విజయదుందుభితో సమానంగా ఈ యజ్ఞభూమిలో నాదం చెయ్యండి.''

వనదేవతా ప్రార్థన :

''ఓ వనస్పతీ! ఓ వనదేవతలారా! ఎప్పుడైతే వాయువు మందగమనంతో మీముందు వీస్తుందో ఆ సమయంలో ఓ ఉలూఖలా ! ఇంద్రుడు పానం చేయడానికై సోమరసాన్ని సిద్ధం చెయ్యి. ఓ ఉలూఖలా ! తామరతూడువంటి ఓ వనస్పతీ ! మధురమైన సోమరసాన్ని ఇంద్రునికోసం తయారు చేయండి. పిండిన సోమరసాన్ని పాత్రలనుంచి తీసుకొని పవిత్రమైన దర్భలపై చల్లండి. మిగిలిన దాన్ని గోచర్మ పాత్రలో ఉంచండి.''

ఇంద్రస్తుతి :

"ఓ సోమపాయీ ! మేమిక్కడ నిరాశులుగా ఉన్నాము. శక్తిశాలీ! సునాశికుడవైన ఓ ఇంద్రా ! మీ కరుణకోసం నేను ఎదురుచూస్తున్నాను. నా శత్రువులు నిద్రించునట్లు చెయ్యి. మిత్రులను మేల్కొలుపు. గంధర్వసమానులైన నా ఈ శత్రువులను నశింపజెయ్యి. నా అశుభాన్ని కోరేవాళ్ళను వధించు."

ఇంద్రుణ్ణి ప్రసన్నం చేసుకోవడానికై నేను సోమరసంతోను, జలంతోను ప్రోక్షిస్తున్నాను. పల్లానికి ప్రవహించే జలంలాగా అతణ్ణి రమ్మను. ఇంద్రునికోసం మనం సమకూర్చిన వాటన్నింటినీ ఆయన సముద్రుడులాగా తనలో చేర్చుకోనీ ! ఏ విధంగానైతే కపోతం తన గర్భిణీ కపోతాన్ని చేరుతుందో అదే విధంగా ఈ సోమముతో కూడిన మా వాణిని మీరు స్వీకరించండి.

శతక్రతుప్రార్థన :

"ఓ శతక్రతూ ! మా ఈ జీవన్మరణ సంఘర్షణపై దయచేసి దృష్టిపెట్టండి. దీనిని నియంత్రించండి. దీనిపై మీ సలహా ఇవ్వండి. మేము మా రక్షణకోసం మిమ్మల్ని ఎల్లప్పుడు ఆహ్వానిస్తుంటాము. మీరు నా ఆహ్వానం విని ఉంటే తప్పకుండ మీ పూర్ణ శక్తితో ఇక్కడకు రండి. మీకు జ్ఞాపకమున్నదా ! పూర్వం నా తండ్రి మిమ్మల్ని

***ఆహ్వానించాడు. నేను నా పూర్వీకులతో సమానంగా మిమ్మల్ని స్మరిస్తున్నాను, ఆహ్వానిస్తున్నాను. ఓ వజ్రీ! మీరు మిత్రులకు మిత్రులు. తమ తమ కోరికలను పూర్తి చేసుకోవడానికి ప్రజలందరు మిమ్మల్ని స్తుతిస్తుంటారు. ఇరుసుపైన బండిచక్రం తిరుగునట్లుగా మీరు ప్రార్థితుల దౌర్భాగ్యమనే ఇరుసుపై చక్రాన్ని త్రిప్పండి. మీ దయ ప్రార్థితులమైన మా పై ప్రసరించుగాక!***

**ఈ స్వర్ణరథం నీ కోసమే :**

ఈ విధంగా శునశ్శేపుడు ఇంద్రుని స్తుతిస్తూ అంజలి ఘటించాడు. అగ్ని అతణ్ణి యూపబంధంనుండి విముక్తుణ్ణి చేశాడు. అతని పాశాలన్నీ తొలగిపోయినై. ఇంద్రుడు అతని ఎదుట సాక్షాత్కరించి ''ఓయీ ! శునశ్శేఫా! నేను నీకు ప్రసన్నుడనైనాను. ఓ సూక్తద్రష్టా! ఈ హిరణ్మయరథం నీ కోసమే. తీసుకో !'' అని శునశ్శేపునికి స్వర్ణరథాన్ని బహూకరించాడు.

**ఇతణ్ణి వదలిపెట్టండి :**

వరుణుడు మహారాజుముందు ప్రత్యక్షమై ''రాజా! శునశ్శేపుని వదలిపెట్టి యజ్ఞం చెయ్యి. నీవు వ్యాధి నుండి విముక్తుడవవుతావు'' అని చెప్పి అదృశ్యమయ్యాడు. వెంటనే రాజు రోగవిముక్తుడయ్యాడు. రాజు శునశ్శేపుని వదలిపెట్టవలసినదిగా ఆజ్ఞాపించాడు. యజ్ఞశాలలో జయజయధ్వానాలు ప్రతిధ్వనించినై.

**నా తండ్రి ఎవరు ?**

అప్పుడు శునశ్శేపుడు లేచి నిలబడి - "మహాత్ములారా ! ఇప్పుడు నా తండ్రి ఎవరు ?" అని సభాసదులను ప్రశ్నించాడు. అప్పుడు కొందరు అజీగర్తుడే అతని తండ్రి అని చెప్పారు. మరికొందరు హరిశ్చంద్రుడతని తండ్రి అని వాదించారు. ఇంకొందరు అతని తండ్రి వరుణుడన్నారు.

ఇంతలో వసిష్ఠమహర్షి లేచి - "పెద్దలారా ! దయచేసి వాదించకండి. వేదప్రమాణాన్ననుసరించి అతని ప్రశ్నకు నేను సమాధానమిస్తాను. ఎప్పుడైతే అజీగర్తుడు తన కుమారునికి వెలకట్టి, బేరమాడి, అమ్మి ధనం తీసుకొన్నాడో - అప్పుడే అతడు తన పితృత్వాన్ని కోల్పోయాడు. ఆ తరువాత హరిశ్చందుడు ఇతనిని కొనుటచేత ఇతనికి తండ్రి అయ్యాడు. కానీ ఎప్పుడైతే హరిశ్చంద్రుడు ఇతనిని యూపస్తంభానికి కట్టివేయమని ఆజ్ఞాపించాడో, అప్పుడతడు కూడ పితృత్వాన్ని కోల్పోయాడు.

**విశ్వామిత్రుడే అతని తండ్రి :**

ఇక వరుణుడు ఇతనిని మృత్యువునుండి రక్షించాడు కాబట్టి అతడే ఇతనికి తండ్రి అని చెప్పడం సరికాదు. ఎందుకంటే దేవతలెవరైనా గొప్ప స్తుతిపూర్వకాలైన మంత్రాలతో, స్తోత్రాలతో స్తుతిస్తే సంతుష్టులై జీవితం, సంపద, గోవులు, భూమి, ముక్తి మొదలైన వాటిని అనుగ్రహిస్తారు. కాబట్టి దీనిలో విశేషమేమీలేదు. కానీ శునశ్శేపుడు దయనీయమైన, విపత్కర పరిస్థితిలో ఉన్నప్పుడు అతనికి విశ్వామిత్రుడు వరుణమంత్రాన్ని ఉపదేశించాడు. కాబట్టి విశ్వామిత్రుడే అతనికి తండ్రి

కావడానికి అర్హుడు'' - అని తీర్పు చెప్పాడు. అక్కడ ఆసీనులైన సభాసదులందరు ఆ నిర్ణయాన్ని అంగీకరించారు.

ఆ తరువాత ఋత్విక్కులు ఆదరంతో శునశ్శేపుని యజ్ఞంలో ఋత్విక్కుగా పాల్గొనమన్నారు. అతడందుకు అంగీకరించాడు. యాగం యథావిధిగా పరిసమాప్తమయింది.

విశ్వామిత్రుడు శునశ్శేపుని తన దత్తపుత్రునిగా స్వీకరించాడు. అజీగర్తుడు తన కుమారుని తిరిగి ఇమ్మని అడిగాడు. కాని విశ్వామిత్రుడు దేవతలు తన కతనిని ఇచ్చారని, అందువల్ల ఇకపై అతనిని 'దేవరాతుడు' (దేవతలచే ఇవ్వబడిన వాడు) అంటారని అన్నాడు. శునశ్శేపుడు కూడ తాను తిరిగి అజీగర్తునితో ఇంటికి వెళ్ళుట అసాధ్యమని అతనికి చెప్పాడు.

విశ్వామిత్రుడు శునశ్శేపుని జ్యేష్ఠపుత్రునిగ స్వీకరించి తన ఆశ్రమానికి తోడ్కొని వెళ్ళాడు. విశ్వామిత్రుని నూటొక్కమంది పుత్రులలో మధుచ్ఛందుని కంటె పెద్దవారైన యాభై మంది శునశ్శేపుని తమ పెద్దన్నగా స్వీకరించడానికి ఒప్పుకోలేదు. అందుకు ఆగ్రహించిన విశ్వామిత్రుడు వాళ్ళు, వాళ్ళ సంతతి తరతరాలుగా మ్లేచ్ఛులు కమ్మని శపించాడు. మధుచ్ఛందునితో సహా మిగిలిన యాభై మంది దేవరాతుని తమ జ్యేష్ఠభ్రాతగా అంగీకరించి విశ్వామిత్రుని అనుగ్రహానికి పాత్రులైనారు. ఈ విధంగా శునశ్శేపుడు విశ్వామిత్రునికి దత్తపుత్రుడై జహ్ను (భృగు), గాధి వంశాలకు ఉత్తరాధికారి అయ్యాడు.

**పిశాచత్వం పోయింది :**

శునశ్శేపుని అమ్ముటవలన అజీగర్తుడు పిశాచమయ్యాడు. అతణ్ణి యమభటులు బాధపెడుతుండగా అది విని శునశ్శేపుడు తన వలన తన తండ్రికిటువంటి బాధలు వచ్చాయని విచారించి, గౌతమీనదీ తీరానికి వెళ్ళి తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి శివకేశవులు ప్రత్యక్షమయ్యారు. వారి అనుగ్రహం వలన శునశ్శేపుడు తన తండ్రి పిశాచత్వాన్ని పోగొట్టాడు.

హరిశ్చంద్రుడు రోగ విముక్తుడైనాడని విని రోహితాశ్వుడు అడవినుండి రాజమందిరానికి తిరిగి వచ్చాడు. మహారాజా ఆనంద బాష్పాలతో కుమారుని కౌగలించుకొన్నాడు. హరిశ్చంద్ర చక్రవర్తి తన భార్యతో, కుమారునితో సుఖజీవనాన్ని గడుపుతూ సత్యవ్రతుడై, ధర్మనిష్ఠతో ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలించాడు. అతని పరిపాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లారు.

**రామాయణంలో శునశ్శేపుడు :**

వాల్మీకిరామాయణంలో శునశ్శేపుని కథ ఇందుకు భిన్నంగా ఉంది. రామాయణం బాలకాండ, అరవై ఒకటి అరవై రెండు సర్గల్లో శునశ్శేపుని కథ ప్రస్తావించబడింది. దీనికి ఆధారం ఋగ్వేదమే. ఈ రెండింటిని పరిశీలిస్తే మనకు కథ స్పష్టంగా తెలుస్తుంది. ఇంకా కాలగతిలో వారి ఆలోచనాపద్ధతి, కథనశైలి, రచనా విధానం ఎలా మారింది కూడా తెలుస్తుంది.

పూర్వం కోసలదేశాన్ని అంబరీషుడనే చక్రవర్తి

పరిపాలిస్తూండేవాడు. ఆయనొక యజ్ఞాన్ని ప్రారంభించాడు. ఆయాగ పశువును ఇంద్రుడపహరించాడు. అప్పుడు పురోహితుడు రాజా! "నీ అశ్రద్ధ వలన పశువు అపహరించబడింది. పశువును భద్రంగా కాపాడుకోలేని ప్రభువును పశునాశదోషం హరిస్తుంది. కావున పోయిన పశువును పట్టి తీసుకొని రావాలి, లేదా యజ్ఞపశువుగా మనిషినైనా తేవాలి" అన్నాడు.

**నీ కుమారుని నా కివ్వు :**

ధీశాలి అయిన అంబరీషుడు నరపశువుకోసం బయలుదేరాడు. పల్లెలు, పట్టణాలు, వనాలు, ఆశ్రమాలు తిరిగి నరపశువు ఎక్కడా లభించక చివరకు భృగుతుంగమనే పర్వతాన్ని చేరాడు. అక్కడ భృగువంశంలో పుట్టిన ఋచీకుడనే తపస్వి భార్యాబిడ్డలతో నివసిస్తున్నాడు. అంబరీషుడతనికి నమస్కరించి కుశలప్రశ్నలడిగిన తరువాత "మునీశ్వరా! నేనొక యజ్ఞం చేయ మొదలుపెట్టాను. నా యజ్ఞ పశువునెవరో అపహరించారు. దానికోసం దేశదేశాలు తిరిగి వెదకాను. కాని దొరకలేదు. కావున నూరువేల గోవులిస్తాను. నీ కుమారులలో ఒకరినిచ్చి నన్ను కృతకృత్యుణ్ణి చెయ్యి" అని విన్నవించుకొన్నాడు.

**సిద్ధంగా ఉన్నా, తీసుకువెళ్ళండి :**

ఋచీకుడామాటలు విని "రాజా! నీవేమిచ్చినా పెద్ద కుమారుని విక్రయించను" అన్నాడు. వెంటనే మునిపత్ని అంబరీషునితో "రాజా! నా భర్త పెద్దబిడ్డను అమ్మనన్నాడు. నేను చిన్న కుమారుని ఇవ్వను. లోకంలో తండ్రికి పెద్దకొడుకు, తల్లికి చిన్నకొడుకు ముద్దుగదా!" అంది.

తన తండ్రి పెద్దవానిని, తల్లి చిన్న వానిని విక్రయించమని చెప్పగా మధ్యవాడైన శునశ్శేపుడు స్వయంగా అంబరీషునితో "మహారాజా ! మా తండ్రి పెద్దవానిని, తల్లి చిన్నవానిని నీకమ్ముటకు ఇష్టపడలేదు. దీనిని బట్టి మధ్యలో ఉన్న నన్ను వాళ్ళు విక్రయించినట్లు తెలుస్తున్నది. కాబట్టి ఇంక ఆలస్యమెందుకు ? సిద్ధంగా ఉన్నాను. తీసుకు వెళ్ళండి" అన్నాడు.

**నన్నీపాపాన్నుండి రక్షించు :**

అంబరీషుడు సంతోషించి ఋచీకునికి ధనమిచ్చి శునశ్శేపుని రథంలో కూర్చోబెట్టుకొని అయోధ్యకు బయలుదేరాడు. వాళ్ళు మార్గమధ్యంలో ఉన్న పుష్కరతీర్థాన్ని చేరునప్పటికి మిట్ట మధ్యాహ్నమయింది. ఎండ తట్టుకోలేనంత తీవ్రంగా ఉంది. అంబరీషుడు బడలిక తీర్చుకోవడానికక్కడ ఆగాడు. రాజు విశ్రమించి ఉన్న సమయం చూసి శునశ్శేపుడు అక్కడ సమీపంలో తపస్సు చేస్తున్న తన మేనమామ విశ్వామిత్రుని వద్దకు వెళ్ళాడు. ప్రాణభయంతో, ఆశతో, మార్గాయాసంతో అతడు తూలుతూ విశ్వామిత్రుని ఒడిలో వాలి "స్వామీ! నాకు తల్లి లేదు. తండ్రి లేడు. మరి జ్ఞాతులెక్కడ ? బంధువులెక్కడ ? అనాథను, దీనుడను. నీ శరణువేడుతున్నాను. రక్షించు. అందరిని చల్లగ కాపాడేవాడివి. అందరికి మేలుచేసేవాడివి. నన్ను కాపాడటం నీకు భారమా? మాతాపితలు నన్ను అంబరీష చక్రవర్తికి యాగపశువుగా విక్రయించారు. కావున మహారాజు కార్యం నెరవేరునట్లు, నేను దీర్ఘాయువునై చిరకాలం తపస్సు చేసి స్వర్గాన్ని పొందునట్లు అనుగ్రహించు. తండ్రి తన కుమారుని వలె నన్నీ పాపాన్నుండి రక్షించు" అని వేడుకొన్నాడు.

**ఈ త్యాగం చెయ్యండి :**

అప్పుడు విశ్వామిత్రుడు ఓదార్పుమాటలతో శునశ్శేపుని ఊరడించి, తన కుమారులను పిలిచి ''బిడ్డలారా ! ఏ శుభం కోరి తల్లిదండ్రులు పుత్రులను కంటారో అటువంటి ఇహపరాల్లో శ్రేయస్సును కలిగించే ధర్మకార్యాన్ని ఆచరించవలసిన అవసరం ఇప్పుడు కలిగింది. నాయనలారా ! ఈ పిల్లవాడు మునిబాలకుడు. నన్ను శరణు వేడాడు. ప్రాణదానం చేసి వీనికి ప్రీతి చేయండి. మీరు పుణ్యశీలురు. ధర్మపరాయణులు. కావున అంబరీషుని యాగపశువుగా అగ్నిహోత్రునికి తృప్తి కలిగించండి. శునశ్శేపుడు రక్షించబడతాడు. చక్రవర్తి యాగం నిరాటంకంగా పరిసమాప్తమౌతుంది. దేవతలు తృప్తి చెందుతారు. నాకు మాట దక్కుతుంది. కాబట్టి మీలో ఎవరో ఒకరు ఈ త్యాగానికి సిద్ధపడండి'' అన్నాడు.

తండ్రి విశ్వామిత్రుని మాటలు విని అతని కుమారులు మధుచ్ఛందుడు మొదలైనవారు ''కన్నబిడ్డలను కాదని పరుల బిడ్డను పరమాదరంతో కాపాడుతావు. ఇదెక్కడి న్యాయం? మంచి అన్నాన్ని త్రోసిరాజని కుక్కమాంసాన్ని కోరినట్లున్నదిది'' అని అభిమానంతో ఎద్దేవాగా మాట్లాడారు.

**నీకోరిక నెరవేరుతుంది :**

తన కుమారులు పరిహాసంతో పలికిన పలుకులకు విశ్వామిత్రుని కన్నులెఱ్ఱబడినై. ''ఓరీ! తుచ్ఛులారా ! మీరు భయభక్తులులేకుండా ఒళ్ళు జలదరించేటట్లు ధర్మబాహ్యమైన,

దారుణమైన మాటలు మాట్లాడారు. కావున మీరు కూడా ఆ వసిష్ఠుని కుమారులవలె ముష్టిక జాతిలోపుట్టి కుక్కమాంసాన్ని తింటూ వెయ్యేళ్ళు పడిఉండండి'' అని వాళ్ళను శపించి కౌశికుడు దుఃఖార్తుడై ఉన్న శునశ్శేపునికి భయం లేకుండా నిరామయమైన రక్షకట్టి ''కుమారా ! నీకు ఎఱ్ఱని వస్త్రాలు ధరింపజేసి, ఎఱ్ఱని గంధము పూసి, ఎఱ్ఱని పూలమాలలు నీ మెడలో వేసి, నిన్ను పవిత్రమైన దర్భపాశాలతో యూపస్తంభానికి బంధించినప్పుడు ఇంద్రోపేంద్రుల నుద్దేశించి నేను చెప్పే ఈ రెండు మంత్రాలను నీవు పఠించు. నీ కోరిక నెరవేరుతుంది'' అని చెప్పి విశ్వామిత్రుడు శునశ్శేపునకు రెండు మంత్రాలనుపదేశించాడు.

**ఇక ఆలస్యమెందుకు ?**

శునశ్శేపుడు ఏకాగ్రచిత్తంతో విశ్వామిత్రుడుపదేశించిన ఆ రెండు మంత్రాలను గ్రహించి అంబరీషుని వద్దకు వెళ్ళి ''మహారాజా ! ఇంక ఆలస్యమెందుకు ? యజ్ఞభూమికి వెళదాం రండి. దీక్షతో యజ్ఞాన్ని నిర్వర్తించండి'' అని తొందరపెట్టాడు. అంబరీషుడు అందుకు సంతోషించి వెంటనే బయలుదేరి అయోధ్యచేరి శునశ్శేపునితో యాగశాలను ప్రవేశించాడు. ఆ తరువాత చక్రవర్తి సదస్యుల అనుమతితో శునశ్శేపునికి ఎఱ్ఱని వస్త్రాలు ధరింపజేసి, ఎఱ్ఱని పూలమాలలువేసి, ఎఱ్ఱని గంధముపూసి దర్భపాశాలతో యూపస్తంభానికి కట్టివేశాడు. మునికుమారుడు విశ్వామిత్రుడుపదేశించిన విధంగా ఇంద్రుణ్ణి, ఉపేంద్రుణ్ణి రహస్యంగా స్తుతించాడు. వెంటనే సహస్రాక్షుడు సంతోషించి శునశ్శేపునికి దీర్ఘాయువునిచ్చి కాపాడాడు. ఇంద్రుని అనుగ్రహంతో అంబరీషునికి బహుయాగ ఫలం లభించింది.

ఈ శునశ్శేఫునికథ వలన మనకు దేవతాస్తుతిరూపాలైన వేద మంత్రాలకు ఎంతటి శక్తి ఉన్నదీ తెలుస్తున్నది. అలాగే సమాజంలోని వ్యక్తుల విభిన్నమైన మనస్తత్వాలను ఈ కథ ప్రతిబింబిస్తున్నది.

సమాజంలో అజీగర్తునివలె కన్నబిడ్డను కూడా నిర్దాక్షిణ్యంగా బలిపశువుగా అమ్మివేయగలిగిన కఠినాత్ములు, అలాగే విశ్వామిత్రుని వంటి పరమకారుణికులు, దయాశీలురైన ప్రేమమూర్తులు కూడా ఉంటారని మనకీకథవలన తెలుస్తున్నది.

సంఘంలో స్వార్థపరులు తమస్వార్థంకోసం ఎంతకైనా తెగిస్తారని, కరుణామయులు, దయార్ద్రహృదయులు నిస్స్వార్థంగా, నిరపేక్షంగా ఇతరులకు మేలు చేస్తారని మనకీకథ తెలియజేస్తున్నది.

**స్వార్థము - పరార్థము**

**కాఠిన్యము - కారుణ్యము**

**నిర్దయ - ప్రేమలకు**

**పరాకాష్ఠ**

***ఈ కరుణరసగాథ!***

*ఓం శాంతిః శాంతిః శాంతిః*